# పెట్టుబడే - లాభమూ

— కంఠంనేని రాధాకృష్ణమూర్తి

"పెట్టుబడిని ప్రేమించుమన్నా!" అన్నాడు కొండస్వామి.

కొండస్వామి ఎవరని అడక్కండి, ఆయన సిద్ధాంత మేమిటన్నది అడగండి చెబుతాను.

**మీ** నాన్నో, మా నాన్న మనకింత డబ్బు సంపాదించి పెట్టి పోయాడనుకోండి. అప్పుడా డబ్బును మదుపుగా పెట్టి మనం మరింత డబ్బును సంపాదించ వచ్చు. అందుకు మనకు బ్రెయిన్ అవసరంలేదు. శ్రమ పడాల్సిన పనిలేదు. కావాల్సిందల్లా డబ్బు మాత్రమే ఆ డబ్బే యీ బ్రెయినునూ, ఈ శ్రమనూ ఇత్యాదుల్లాంటి వాటిని కొని, ఖర్చు పెడుతుంది. మన పనల్లా ఆ వచ్చే డబ్బును జమ చేస్తూ పోతుండటం. పైగా యీ తమాషాను చేస్తూ, చూస్తూ మీకు మీరు ఆనందిస్తూనూ వుండొచ్చు. ఇదీ కొండస్వామి సిద్ధాంతం. ఉదాహరణకు మీరు సినిమా తీయొచ్చు. తీసి, ప్రేక్షకుల అభిరుచుల్ని పొల్యూట్ చెయ్యొచ్చు చేసి, వాళ్ళ అభిరుచుల కనుగుణంగానే సినిమా తీస్తున్నామంటూ దబాయించ వచ్చు ఎంత వినోదంగా వుంటుందీ ఆట! మనకు నష్టమనేదేమీ లేదు, అంతా లాభమే. డబ్బుకి డబ్బులూ వస్తుంటాయి, ఆనందానికి ఆనందాన్నీ జుర్రుకోవచ్చు. అట్లాగే మీరో పత్రిక పెట్టవచ్చు పెట్టి, మేధావి వర్గంగా అనుకోబడే రచయితల చేత నానా బఫూన్ చేష్టలూ చేయించవచ్చు-వాళ్ళ రచనల్లోనూ, వాస్తవ జీవితంలోనూ కూడా పేరుకు పేరూ వస్తుంది, వాళ్ళను వెర్రి వెంగళాయిల్ని చేస్తున్నందుకు మీ ఇన్ఫీరియర్ 'ఇగో'కి సంతృప్తి లభిస్తుంది ఇట్లా ఏ రంగంలోనైనా సరే మీకు లాభమే ఎదురవుతుంది. ఎంత బాగుందండీ యీ ఆట! అందుకే గావును అంతా కొండస్వామి సిద్ధాంతాల కెగబడుతుంటారు, డబ్బులే వుండవుగాని....

డబ్బులున్న వాళ్ళల్లో తురంగారావు ఒకడు, అతనికో బట్టల షాపుంది ఆ షాపు కౌంటర్ వద్ద కూర్చునే మనిషి తురంగరావే అక్కడ అతను తప్ప మరొకళ్ళు కూర్చోరు సామాన్యంగా చాకుల్లాంటి కుర్రాళ్ళిద్దరూ, చురుకైన మరో కుర్రదీ అక్కడి సేల్స్ వ్యవహారాలు చూస్తుంటారు. కుర్ర వాళ్ళిద్దరూ చీరల సెక్షన్ చూస్తుంటే, కుర్రదేమో షర్టింగ్, సూటింగుల సెక్షన్లని చూస్తుంది. దీన్ని బట్టి తురంగరావు తెలివిని ఊహించుకోవచ్చు.

ఆ కుర్రదాని పేరు వనజ.

వనజ పొడుగ్గా వుంటుంది కాస్త సన్నమనిపించినా ఏమిటి మాత్రం. ...... ... ఆమె ముక్కు పొడుగ్గా రామచిలకలా చివర వంపు తిరిగి వుంటుంది పుటాలు కొంచెంగా కట్ అవుతూ. ఆమె కళ్ళు మామూలుగా వుంటాయి పెద్ద ఆకర్షణేమీ లేకుండా.

అట్లాంటి ఆమె సేల్స్‌గాళ్‌గా చేరాల్సి వచ్చింది కుటుంబ పరిస్థితులు కారణంగా. తండ్రీ, తల్లీ, ఇద్దరు చెల్లెళ్ళూ, ఒక తమ్ము

క్షే పోషించాలాపె. వాళ్ళ చదువుల్తోపాటు అంత పెద్ద పరివారంతో ఆ మాత్రం సంపాదనతో ఆమె చేయి నోటి వద్దకు పోవటమే గగనంగా వుండేది. అట్లాంటిది ఆమెను ఉత్సాహంగా వుండమన్నా, వచ్చే పోయే వారితో నవ్వుతూ వ్యవహరించమన్నా అది కొంత కఠినమైన ఉత్తర్వు క్రిందనే వస్తుంది. కాని వ్యాపార, వ్యవహారాల్లో యిట్లాంటి మానవతా సూత్రాలకి స్థానం లేదు.

షాపులో చేరిన కొత్తలో ఆమె కొంత డల్‌గా వుండేది. కస్టమర్స్‌తో టిమిడ్‌గా మాట్లాడేది. ఇది చూసి తురంగరావు ఒకసారి ఆమెను హెచ్చరించాడు

"చూడమ్మాయ్, నువ్వట్లా వుంటే కుదరదు. కాస్త ఉత్సాహంగా వుండాలి. నీకు యిష్టమున్నా లేకపోయినా కస్టమర్స్‌తో నవ్వుతూ మాట్లాడుతుండు. అలా కుదరదంటావా నేను మరొకళ్ళను చూసుకోవాల్సి వుంటుంది."

అది విని గుటక మింగింది వనజ. మర్నాటి నుంచీ నవ్వుతూ వుండటానికి ప్రయత్నించింది, ఇంటి పరిస్థితుల్ని అబ్లివియన్‌లోకి నెట్టుకుంటూ ..

కనకరాజు అనీ ఆ టవున్లో ఒక 'డాన్ జువాన్' వుంటున్నాడు. అతనికి కొంత ఆస్తి, కొందరు అనుచరులు, కొండంత పెద్దకీర్తి వున్నాయి. వీటన్నింటినీ మించి స్త్రీ వ్యసనం వుంది. సామాన్యంగా కోరుకున్న ఆడదాన్ని ఏ ప్రయత్నం ద్వారనైనాగాని పొందే దాకా నిద్రపోడు మనిషి కూడా ఆడవాళ్ళకు అనంగీకారంగా ఏమీ వుండదు అట్లాంటి కనకరాజు దృష్టి ఓ శుభముహూర్తాన వనజ మీద పడింది.

ఆ రోజు అతను తనకు షర్టుపీసు తీసుకుందామని షాపులోకి ప్రవేశించాడు. ఆ తాను, ఈ తానూ కెలికించాక ఆఖరికి పువ్వుల డిజైను గల ఒక గుడ్డను చూపించుతూ యథాలాపంగా అన్నాడతను

"ఈ షర్టింగ్ నాకెట్లా వుంటుందంటారు?"

"బ్యూటిఫుల్!" యాంత్రికంగా అన్నది తను.

ఆ ఒక్కమాట తన జీవితంలో ఎంత పెద్ద మలుపుకి దారితీయబోతోందో ఆమె ఎరుగదు. 'బ్యూటిఫుల్!'–ఆ పదం ఆ రాత్రల్లా కనకరాజును హాంట్ చేసింది. అతని పట్ల ఆ మాత్రం కాంప్లిమెంటరీగా అంతకుముందు ఎవరూ అని ఉండలేదని కాదు అన్నారు కొందరు స్త్రీలు అయితే అందులో తనపట్ల భయమూ, తత్సంబంధితమైన కృత్రిమత మాత్రమే కనిపించాయతనికి కాని ఇవాళ ఈ యువతి ఎంత సహజంగా అన్నది! (ఒక డ్యూటిఫుల్ జేమ్‌గా మాత్రమే ఆమె ఆ పదాన్ని వాడిందన్నది అతనికి పొరపాటునైనా తట్టలేదు) నిజానికి వనజ పెద్దగా అందమైనది కాదు. కాని ఆమెలోని ఏ లక్షణమో కనకరాజులో వ్యామోహాన్ని రేపింది. బహుశా అంతకుముందు అతనికి తటస్థపడ్డ చాలా మంది ఆడవాళ్ళలో కనిపించని నిర్మాల్యమేమో ఆమెలో అతనికి కనిపించి ఉండొచ్చు.

రెండురోజుల తర్వాత కనకరాజు మళ్ళీ తురంగరావు షాపుకు వెళ్ళాడు.

"హల్లో స్వీటీ, బాగున్నావా?" అన్నాడు.

అతని సంబోధన శృతి మించిందని అర్థం చేసుకుంది వనజ


"నా పేరు స్వీటీ కాదు" అన్నది కోపంగా.

"స్వీటీ కాకపోతే బ్యూటీ!" నవ్వాడు కనకరాజ

"మర్యాదగా మాట్లాడండి."

"మర్యాదగా కాక నేనేమన్నా అమర్యాదగా మాట్లాడుతున్నానా? ఏమండీ ప్రొప్రయిటరుగారూ మీరే చెప్పండి, ఈమె ఇట్లా మాట్లాడుతుందేమిటి?"

తురంగరావు కొంచెం ఇవతలకు వచ్చాడు



వనజా, ఏమిటా దుడుకుతనం! కష్ట
మర్చుతో మాట్లాడే తీరు అదేనా....సారీ

సార్, మీకేం కావాలో చెప్పండి...."
"మొన్న ఈకె సెలక్టు చేసి పెట్టిన

పర్టు చాలా బాగుందన్నారండీ నా మిత్రులు. అందుకని ఈమె సెలక్షన్‌లో మరో ముక్క తీసుకుందామని వచ్చాను. ఈమే మో యిట్లా మాట్లాడుతోంది."

"లేదు లేదు, అదేమీ పట్టించుకోకండి," తురంగారావు అన్నాడు. "బట్టల విషయంలో ఈమెకు చాలా మంచి తెలుస్తుంది. చూపించు వనజా యీ సార్‌కేం కావాలో"

నిస్సహాయంగా వనజ ఒక్కో తానునీ అతనికి చూపించ సాగింది.

ఎనభై రూపాయలు గిరాకీ చేసిపోయాడు కనకరాజు.

"మొన్నటి అతనికి నేనేమీ సెలెక్టు చేసి పెట్టలేదండి," అతను వెళ్ళిపోయాక తురంగారావుతో అన్నదామె.

"ఆ సంగతి నాకు తెల్సు వనజా," తురంగరావు అన్నాడు. "మేము సేల్స్‌గర్ల్స్‌ని ఎందుకు పెట్టుకుంటామంటావు? వాస్తవం చెప్పాలంటే కస్టమర్సుని ఆకర్షించటానికీ, తద్వారా వ్యాపారం వృద్ధి చెందించుకోవటానికీ—"

"కాని అతను చూడండి, ఎట్లా మాట్లాడుతున్నాడో నాతో...."

"ఏమంత అసభ్యంగా మాట్లాడాడని వనజా, నీకు నీవు అనవసరంగా భుజాలు తడుముకుంటున్నావుగానీ!?"

"అది కాదండీ," కళ్ళ నీళ్ళ పర్యంతమవుతూ అన్నది వనజ. "ఈ చనువుని పురస్కరించుకుని అతను బజారులో ఏమన్నా అసభ్యంగా ప్రవర్తించితే.. ."

"అది నీ వ్యక్తిగత విషయం," నిష్కర్షగా చెప్పాడు తురంగరావు. "ఇక్కడ ఈ షాపులో వున్నంతలో నీపట్ల ఎవరన్నా అసభ్యంగానో, అనాగరికంగానో ప్రవర్తిస్తే అందుకు పూచీ నేను తీసుకుంటాను. బయటి వ్యవహారాలు నాకనవసరం. ఇది నాకు వ్యాపారమూ, నీకు ఉద్యోగమూ. ఇక్కడ మన ఇష్టా ఇష్టాలకీ, వ్యక్తిగత బలహీనలకీ తావు లేదు. యాంత్రికంగా మన పనుల్ని మనం చేసుకుపోవాలి."

ఆ రాత్రి ఇంట్లో అంతా నిద్రపోయాక దుప్పటి ముసుగులో కుళ్ళి కుళ్ళి ఏడ్చింది వనజ. తన నిస్సహాయత్వానికీ, ఆర్థిక అసమర్థతకీ ఆమెకు చాలా చాలా కోపమొచ్చింది. ఆ కోపంతో కాసేపు ఉద్యోగాన్ని వదిలేసు కుందామనుకుంది కూడా. కాని అది ఆమె చేతుల్లో లేదు. ఆమే పరిస్థితుల చేతుల్లో వుంది.

ఆ తర్వాత కనకరాజు తరచుగా ఆ షాపుకి వస్తూ, పోతుండటం సాగించాడు. మిత్రులకు బట్టలు సెలక్షన్ చేసి పెట్టాలనే నెపంతోనో లేక తనే బట్టలు కొనాలనే కారణంతోనో, ఈ రకంగా—

ఒక్కో రోజు కనకరాజు తిన్నగా చీరల సెక్షన్ వేపు పోయేవాడు.

"కొంచెం ఆమెను పిలుస్తారా?" వనజ వేపు చూపించుతూ అనేవాడు.

"ఆయనకేవో కావాలంట చూపించు వనజా!" అంటాడు తురంగరావు

వనజ ఆవేపు నడుస్తుంది.

"ఈ చీర మా ఆవిడకు సూటవుతుందంటారా?"

మీ ఆవిడెట్లా ఉంటుందో నాకు తెలియదు"

"మీలాగే ఉంటుంది. కాకపోతే కొంచెం రంగు తక్కువ"

కాస్త ఖరీదైన రకాల్లో ఒక చీరను చూపుతుంది వనజ.

"బహుశా ఇది బాగుండొచ్చు" అంటుంది.

(తురంగరావు ఆమెకలా ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చాడు, డర్టీ జాబ్!!)

"మీకు నచ్చిందంటారా?" అంటాడతను

"మహాబాగా! ఎందుకంటే ఈ బోర్డర్ చూడండి... "

"అయితే ప్యాక్ చేసెయ్యండి"

"మరి దీనిమీదకు మ్యాచింగ్ బ్లవుజ్ పీస్ తీసుకోరూ?"

"ష్యూర్, ష్యూర్-"

వగైరా వగైరా

**"హాస్య కథల పోటీ"**

**"జ్యోతి హాస్య కథల పోటీ కి మాకు కథలు చేరవలసిన ఆఖరు తేదీ 'జూన్ 15' వరకు పొడిగించాము**

**-జ్యోతి**

ఒక్కోసారి వనజకు సందేహ మొచ్చేది, నిజంగా అవసరమయ్యే అతనా బట్టల్ని తీసుకుంటున్నాడా అని. కాని ఆమెకు అనవసరం ఆమె షన్నకాశ్యపాలం వృద్ధి చెందటానికి సహకరించటం—ఫలితంగా అయిందో ఏదో జీతం పెంచబడ్తుతుంది.

(అయిందో ఏదో! హా...ఎంత పెద్ద మెట్టు తేస్తుంది! అర్థంకామె కష్టపడుతోందో నష్టపడుతోందో ఏమైనా ఉందా? ఉంది ఉంది, చూడండి ముందు ముందు, .)

కనకరాజు వచ్చినప్పుడల్లా షాపులోని మిగతా కుర్రవాళ్ళు తనవైపు అదోలా చూడటమూ, కళ్ళతో తమలో తాము సైగలు చేసుకోవటమూ వనజ గమనించక పోలేదు. కాని ఆమె చెయగలిగింది ఏమీ లేదు. అలాగే మొహంమీదికి నవ్వును పులుముకుని తన ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తిస్తుండేది. ఆమె ఇబ్బంది అలా ఉంటే తురంగరావేమో సంతోషాన్ని ఫీలవుతుండేవాడు. సేల్స్‌గాళ్‌ని పెట్టుకున్నందుకు ఫలితం దక్కుతోంది గదాని

వనజకు కొన్ని మంచి అలవాట్లు న్నాయి. అట్లాంటివాటిల్లో ఒకటి—ఆదివారాలు సాయంసమయాల్లో కాసేపు గార్డెన్‌కు పోయి ఓ మూల కూర్చుని చీకటి పడేదాకా కాలక్షేపం చేసి రావటం. సాధారణంగా అట్లాంటి సమయాల్లో మనుష్యులు కాస్త ఉల్లాసంగా ఉంటుంటారు కాని వనజకా అవకాశం లేదు. తన భవిష్య జ్జీవితం ఏరకంగా గడవబోతోందా అన్నది బేరీజు వేసుకో ప్రయత్నిస్తుందామె అట్లాంటప్పుడు. ఓరోజు అలాంటి సమయంలో ఆ బాపతు ధ్యానంలో ఉన్నప్పుడు దగ్గరలో స్కూటర్ ఆగిన చప్పుడు వినిపించిందామెకు.

"హల్లో!"

ఎదురుగా కనకరాజు!

ట్రిమ్‌గా.

"మీరిలా ఆదివారాలు ఇక్కడకు వస్తుంటారని నాకు చిన్నసే తెలిసిందండీ," ఆమెకు దగ్గరలో కూర్చుంటూ అన్నాడు.

గజగజమని వణికిందామె. కాని బయట పడలేదు.

సంభాషణ ప్రారంభించాడు కనకరాజు.

ఆ తర్వాత రెగ్యులర్‌గా అతడామెను అక్కడ కలవటం మొదలెట్టాడు. మొదట్లో ఆమె ఇబ్బందిగానూ అసహనంగానూ ఫీల యింది గాని తర్వాత తర్వాత ఇంటరెస్టింగానే అనిపించిందామెకు ఎడారిమీద నీటి జల్లు!

ఒకరోజు అతనామెకు ఒక ప్యాకెట్టును బహూకరించబోయాడు

"ఏమిటది?"

"నువ్వే చూడు!"

(చాలా త్వరలోనే అతనామెను 'నువ్వు'

అనేటం మొదలెట్టాడు.)

విప్పదీసి చూసిందామె. అంతకుముందు తను షాపులో కొన్న ఖరీదైన చీర! ప్లస్ మ్యాచింగ్ బ్లవుజు. ఒక్క క్షణం ఆమె మనసు పురివిప్పి నాట్యం చేయబోయింది. ఆ వెంటనే కృంగిపోయిందామె.

"క్షమించండి, ఇట్లాంటివి నేను తీసుకోను"

"ఎందుకని?"

"నా జీతం ఎంతని? ఇంత ఖరీదైనవి నేను కొనగలననీ మేన్టైన్ చేయగలననీ జనం అనుకోగలరంటారా??"

"సారీ వనజా, నేనవేమీ ఆలోచించలేదు. నిజానికి నేనీచీర కొన్నది నా భార్య కోసమనీ కాదు, నాకు భార్య ఉండీ కాదు. నీకోసమే కొన్నాను. నువు దీన్ని స్వీకరించలేకపోవటం నా దురదృష్టం. త్వరలోనే నీ పరిస్థితులు మారతాయని ఆశిస్తున్నాను.

కదిలిపోయిందామె ఆ రోజు మానసికంగా.

ఆ మరు ఆదివారం అతనామెకో ఉంగరాన్ని ప్రెజెంట్ చేసాడు. ఆమె తిరస్కరించబోయింది గాని కుదర లేదు. ఉంగరాన్ని స్వీకరించక తప్పలేదామెకు.

అందరూ కాదుగాని, ఇరుకు పరిస్థితుల గుప్పిళ్ళలో చిక్కుకున్న ఆడవాళ్ళు చాలా మంది మైనపు ముద్దలాంటి వాళ్ళు. వాళ్ళను కరగించి మనకే షేపులో కావాలంటే ఆ షేపులోకి మల్చుకో వచ్చు. ఈ సంగతి కనకరాజుకు బాగా తెలుసు. అతనా విద్యలో బాగా ఆరితేరిన వాడు. ఎవరితో ఎలా డీల్ చేయాలో వాళ్ళతో సరిగ్గా అట్లాగే డీల్ చేస్తాడు.

వనజా, వనజా! మరి నువ్వు?

ఆమె చాలా అమాయకురాలు, కాక బలహీనురాలు. కనకరాజు గురించి అంతా అట్లా అంటారేమిటి? అంతటి రౌడీ కాదా అంటే తనను బజారులో అల్లరి పెట్టి ఏమి చెయ్యాలనుకుంటే అది చేయలేడా యింతకు ముందు కొందరిని చేసినట్లు!? మరి తనతో అంత సాఫ్‌గా ప్రవర్తిస్తున్నాడు?? పరివర్తన చెందాడేమో. జీవితంలో యిక సెటిల్ కాదల్చుకున్నాడు గావును. అందుకు తనను ఎన్నుకుని వుంటాడు....

(తెలుగు సాహిత్యమా, తెలుగు కన్నెల మీద నీ ప్రభావానికి ఏమని పొడగవలె నిన్ను??!)

ఆ తర్వాత మామూలే. సినిమాలు, సినిమాలు—అతనితో ఆమె—ఆమె వెంట అతను—చిత్రకారు రైలో కుక్కలు—ఏమూలో, ఎక్కడో, ఎప్పుడో — శరీరాలదేముంది, ఎవ్రెడీ బ్యాటరీలు—ఎన్నాళ్ళని ఆమె మాత్రం ప్రకృతిని ఎదిరించి బ్రతకగలదు—డింగ్—డింగ్—డింగ్.

ఫలితం?

విత్తు మొలిచింది. జూనియర్ కనకరాజు ఆమె కడుపులో రూపు దిద్దుకుంటున్నాడు. అక్కణ్ణించి ప్రారంభమైంది అసలు గొడవంతా—

ఆమె కాస్త ఆలస్యంగా గ్రహించింది. గ్రహించాక అతనితో చెప్పింది. మొదట్లో అతను వినీ విననట్లు చేసాడు. వినక తప్పదని తెలిసాక ఎంత దుర్మార్గంగా అన్నాడని!

"నీ కడుపులో వున్నది నా అంశేనని రుజువేమిటి? నీకు నా ఒక్కడితోనే సంబంధమున్నదని నమ్మక మేమిటి?? నా దగ్గర నాటకాలేయకు...."

(దేముడు లేడండీ. ఉంటే అప్పటికప్పుడు భూమి బద్దలై అతణ్ణి అక్కడికక్కడ పాతిపెట్టేసి ఉండును....)

ఆ తర్వాత కనకరాజెవరో, ఆమె ఎవ్వరో! కనకరాజు ఆమెకసలు అందకుండా పోయాడు....

వనజా—మరి నువ్వేమిచేయదల్చుకున్నా వమ్మా??

ఏం చేస్తుంది?

తురంగరావుకు కల్సి-ఇంటివద్ద-అంతా చెప్పుకుని-భోరుమని ఏడ్చి ...

ఏడిస్తే ఎవడికి జాలి?!

"చూడు వనజా," తురంగరావ్ సెడ్! "నిన్నేదో షాపులో అందరితో నవ్వుతూ ఉండమన్నానేగాని ఆ నవ్వు నలా బజార్లో కంటిన్యూ చేయమనీ, ఆ తర్వాత ఇంకా ఇంకా చేతల్దాకా పొమ్మనీ నేను చెప్పలేదు. ఇది నీ స్వయంకృతాపరాధం. నేను చేయగల్గిందేమీ లేదు. కనకరాజులాంటి గూండాలతో నేను తగాదాలకు దిగలేను...."

(ఆమె ఏమన్నా మనిషా లేక మెషీనా? డ్యూటీలో అయినా గాని ఒకసారి ఒక మనిషితో నవ్వుతూ మాట్లాడినాక తిరిగ ఇయట ఎక్కడన్నా తటస్థపడితే అతన్తో ఎరగనట్లు ప్రవర్తించటం ఈ సభ్య సమాజంలో ఎలా సాధ్యమవుతుంది?! తురంగ రావూ, నీ కూతుళ్ళను ఇళ్ళల్లో దాచుకుంటున్నావు కాబట్టి ఇలా అంటున్నావుగాని వాళ్ళనికూడా ఇట్లాంటి సిట్యుయేషన్స్‌లో పెట్టి చూడు నీ మనస్సుకి ఎంత క్షోభ కలుగుతుందో తెలుస్తుంది!)

అతని సమాధానం వినగానే వనజకు గంగవెర్రు లెత్తాయి. ఎవరిమీదో ఆశ పెట్టుకోవటంవల్ల లాభం లేదని అర్థం చేసుకుంది. ఆదరాబాదరా డాక్టర్ని కలిసింది. ఎబార్షనుకూ సమయం మించిపోయిందట. ఆపరేషనే గతి. ఆపరేషనంటే డబ్బుల్తో పని. మరి డబ్బులు??

యత్నుడివై పోయినావు కనకరాజూ!!

ఈలోపు కడుపు పెరిగి-ముందు ముందుకు ఉరికి-

('భగవంతుడా; కపటమూ, కనటమూ అనే ప్రక్రియల్ని ప్రవేశపెట్టి ఆడటానికి ఎన్ని కష్టాలు తెచ్చిపెట్టావు నా తండ్రీ!)

"నువ్వింక రెస్టు తీసుకోవటం మంచిది వనజా"-తురంగరావు ఉవాచ!

ఇప్పుడతని షాపులో వనజ స్థానంలో కత్తిలాంటి మరో పిల్ల-

ఇప్పుడు వనజ ఏంచెయ్యాలి? ఏ మునెయ్యో గోడెయ్యో చూసుకోవాలా? అలా చేయటానికి చాలా సాహసం కావాలి. తెగింపు కావాలి. జీవితంపట్ల విరక్తి ఉండాలి. ఎవరితోనూ మానసిక అనుబంధాలు ఉండరాదు. ఆమెకీ క్వాలిఫికేషన్స్ అన్నీ ఉన్నాయా??

ఇక పోతే రెండోది-అవివాహిత తల్లిగా పరిస్థితుల్ని ఎదుర్కోవటం. రాబందులూ గుంటనక్కలతో నిండి ఉన్న ఈ సమాజంలో అదంత తెలివైన విషయం కాదు. అనుక్షణమూ చిత్రహింసల ననుభవించాలి. ఆ చిత్రహింసలు ఏమిటన్నది స్వయంగా అనుభవించినవాళ్ళకే తెలుస్తుందికాని కాగితంమీద రాస్తేను, వేదికలమీద వాగితేను అర్థం కాదు.

ఇంతా చేసి చెప్పవచ్చేదేమిటంటే-

పెట్టుబడి గురించి! పెట్టుబడి అనేది చాలా ఆనందదాయకమైన, సుఖప్రదమైన ఒక వింతయిన ఆట-ఆ ఆటలో మీకన్నీ లాభాలే లాభాలు! అందులో సాటి మనుషుల ధనప్రాణాలనుంచీ వాళ్ళ మానాభిమానాలదాకా మీకు పావులుగా ఉపయోగపడుతుంటాయి. లాభాలు మీకూ, నష్టాలు ఎదుటివాళ్ళకూ. అందుకు చిన్న ఉదాహరణ వనజ! అంతే.... ★